క్లుప్తంగా

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

డాబాగార్డెన్స్: ఈపీడీసీఎల్ జోన్–1 డివిజన్ 11కేవీ కొబ్బరితోట ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ జి.సత్యనారాయణ ప్రకటనలో తెలిపారు. ప్రసాద్ గార్డెన్స్, రామకృష్ణా జంక్షన్, కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట, భూపేష్‌నగర్, లక్ష్మీదేవిపేట, మనోరమ వెనుక ప్రాంతం, గోకుల్ థియేటర్, బౌడారా రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, నేరెళ్ల కోనేరు, కర్ణాల వీధి, దేవాంగుల వీధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

గంగులగెడ్డలో బల్లల పండగ



నవీన్‌కుమార్‌ను సత్కరిస్తున్న రజక సంఘాల ప్రతినిధులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డు గంగులగెడ్డ, కనకలదిబ్బలో మంగళవారం బల్లల పండగ నిర్వహించారు. వివిధ రజక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు నాయకుడు బత్తిన నవీన్‌కుమార్ పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్‌ను రజక సంఘాల ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకుడు ఎరబాల అప్పారావు, జితేందర్, దొడ్డి త్రిమూర్తులు, మదీనా వలీ, ఆర్జి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ తోట పద్మావతి

అల్లిపురం: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వార్డు వలంటీర్లతో పాటు కన్వీనర్లను ప్రభుత్వం నియమించిందని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. వార్డు కార్యాలయంలో మంగళవారం ఆమె వార్డు నాయకులు, కన్వీనర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కన్వీనర్ తమ పరిధిలోని గృహ సారథులతో కలసి పనిచేసి ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు లండా రమణ, టర్నల్ చౌల్ట్రీ మాజీ చైర్మన్ లింగం శ్రీను, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఘనంగా భక్త మార్కండేయ జయంతి



మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

డాబాగార్డెన్స్: బురుజుపేటలోని భావన రుషి ఆలయంలో పద్మశాలి ఆత్మీయ సేవా సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ జయంతిని నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకుడు భావన రుషి, భద్రావతి దేవి దివ్యమూర్తులకు, భక్త మార్కండేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ అనంతరం మృత్యుంజయ హోమం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీ రాజశేఖర్, భావన రుషి ఈశ్వర ఆలయ కమిటీ సభ్యుడు, పద్మశాలి ఆత్మీయ సేవా సంఘం వ్యవస్థాపకుడు కె.రాంకుమార్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు రాజారావు, సంఘం సేవకురాలు గాయత్రి ఫణికుమారి, ఇందన్న భద్రరావు, కేవీ నర్సింగరావు, ఇమంది రాంబాబు పాల్గొన్నారు.

వైభవంగా పోలమాంబ జాతర

- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- నేడు మహా అన్నదానం



జాతరలో పులివేషాలు



విశేష అలంకరణలో పోలమాంబ



స్టాల్ వద్ద సందర్శకులు

డాబాగార్డెన్స్: పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. జీవీఎంసీ 30వ వార్డు పరిధి కుమ్మరి వీధిలో కొలువుదీరిన బహుముఖరూప పోలమాంబ 65వ వార్షిక జాతర సందర్భంగా అంతటా పండగ వాతావరణం నెలకొంది. సోమవారం తొలేళ్లతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ప్రధాన పండగ సందర్భంగా సాయంత్రం 5గంటల నుంచి సందడి మొదలైంది. వీధుల్లో విద్యుద్దీపాల అలంకరణ ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా పౌరాణిక వేషధారణలు, సాముగరిడీలు, దాసుల సందడి, పులివేషాలతో పరస మహోత్సవం సందడిగా సాగింది. డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ బ్యాండ్, డీజే వాయిద్యాల హోరుతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణం వద్ద నిప్పుల గుండం, భక్తుల సమక్షంలో ముత్తయిదువులతో ఘటాభిషేక ఉత్సవం జరిపించారు. కుమ్మరి వీధి, సాలిపేట, చాకలిపేట, తాడివీధి, వార్డుబాయ్ లేన్, మంథా వారి వీధి, పూర్ణా మార్కెట్, మహారాణిపేట తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై, అమ్మవారికి మొక్కులు సమర్పించారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

కన్నబాబు సేవలు ప్రశంసనీయం



కన్నబాబును సత్కరిస్తున్న శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్: ప్రముఖ సంఘ సేవకుడు కన్నబాబును స్వామి వివేకానంద సంస్థ సభ్యులు మంగళవారం సత్కరించారు. ఇటీవల సంస్థలో నిర్వహించిన వివేకానందుడి జయంత్యుత్సవాల్లో కన్నబాబు అనారోగ్యం కారణంగా పాల్గొనలేకపోయారు. దీంతో వారంతా ఆయన ఇంటికి వెళ్లి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ చేతుల మీదుగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీవత్సవ్ మాట్లాడుతూ పేద ప్రజలకు భూములు దానం చేసిన గొప్ప వ్యక్తి అని కన్నబాబును కొనియాడారు. కనమహాలక్ష్మి ఆలయ ధర్మకర్తగా, జగన్నాథస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడిగా ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన ఆరోగ్యం కుదుటపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు నాగమణి, ఉమాదేవి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘అమ్మవారి ఉత్సవాలకు సహకరించండి’



టూటౌన్ సీఐ తిరుమలరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న విజయలక్ష్మి తదితరులు

అల్లిపురం: శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరిలో నీలమ్మవేపచెట్టు అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా విజయలక్ష్మి తెలిపారు. ఉత్సవ నిర్వహణకు సహకరించాలని టూటౌన్ సీఐ తిరుమలరావును కోరారు. మంగళవారం చైర్మన్‌తో పాటు శ్రీనివాసరెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు లక్ష్మీకాంతం, కన్నూరు గంగ, భీమరశెట్టి చంద్రకళ సీఐను కలిశారు. ఉత్సవాలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

26న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 26న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శిరీష తెలిపారు.

ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు

- జగనన్న పాలనలో ప్రతీ ఇంటికీ సంక్షేమ ఫలాలు
- కుల, మత, రాజకీయాలకు అతీతంగా లబ్ధి
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- 31వ వార్డులో ‘గడప గడపకు మన ప్రభుత్వం’



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతం అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా 31వ వార్డు డ్వాక్రాబజారు సచివాలయ పరిధిలో మంగళవారం ఆయన పర్యటించారు. ప్రభుత్వ పాలన ఎలా ఉంది తల్లీ? పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా అంటూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలు తీరు, సచివాలయ వ్యవస్థ పని తీరు, పెన్షన్ల అమలు ప్రక్రియ ఎలా సాగుతుందనే అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఏవైనా పథకాలు అమలు కావాలంటే ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రతి వార్డులో చెబుతున్నారన్నారు. మనందరి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేవలం అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పార్టీలు, కులాలు, మతాలకతీతంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. కనీవిని ఎరుగని రీతిలో దేశంలో ఎక్కడా లేని విధంగా 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించిన ఘనత జగనన్నకే చెందుతుందన్నారు. మరో 30 ఏళ్లు సీఎంగా జగన్‌నే రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, డీఈఈ వెంకటేష్, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, పార్టీ నాయకులు బత్తిన నవీన్‌కుమార్, దొడ్డి బాపూ ఆనంద్, ధనలక్ష్మి, భవానీ, రాంబాబు, మొకర గోపి, పల్లా శ్రీనివాస్, గంటా శ్రీనివాస్, రాము మాస్టారు, దండి వెంకటేష్, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

పోలీసులకు ఆటో డ్రైవర్లు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ ఎర్రంనాయుడు



సమావేశంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

అల్లిపురం: అసాంఘిక కార్యకలాపాలు, నేరాల నివారణకు ఆటో డ్రైవర్లు పోలీసులకు సహకరించాలని ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ ఎర్రంనాయుడు కోరారు. అల్లిపురం వైర్లెస్ కాలనీలో ఆటో డ్రైవర్లతో ఎస్ఐ ఈశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో సీఐ మాట్లాడారు. నగరంలో ప్రభుత్వ రంగ పరిశ్రమలైన హార్బర్, పోర్టు, స్టీల్ ప్లాంట్, టూరిజం కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి అనేక మంది పర్యాటకులు, వ్యాపారవేత్తలు వస్తుంటారని చెప్పారు. వారితో ఆటో డ్రైవర్ల ప్రవర్తన విశాఖ ప్రజల మైత్రిని చాటేలా ఉండాలన్నారు. ఆటోలో ప్రయాణికులు తమ బ్యాగులు, ఇతర వస్తువులు మరిచిపోతే పోలీస్ స్టేషన్లలో అప్పగించి తమ నిజాయితీని చాటుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో హెచ్‌సీలు రమణ, సీహెచ్.సత్యనారాయణ, కానిస్టేబుల్ అంజయ్య, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి, స్టాండ్ అధ్యక్షుడు వై.వెంకటి, కన్నారావు, హెచ్.శేఖర్ పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు



చెత్త తొలగిస్తున్న కార్పొరేటర్ నారాయణరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు దిబ్బలపాలెం రామాలయం వద్ద ఇటీవల కొట్టిన రావిచెట్టు వ్యర్థాలను మంగళవారం తొలగించారు. కార్పొరేటర్ నారాయణరావు వార్డు పర్యటనలో భాగంగా అక్కడ నెలకొన్న చెత్తాచెదారాలు, వ్యర్థాలను చూశారు. స్థానికులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా శానిటరీ సిబ్బందితో దగ్గరుండి వ్యర్థాలు తొలగించి, తరలించారు.

గాజువాకలో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకు వినతి



కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు జ్ఞాపిక అందజేస్తున్న విజయలక్ష్మి

మహారాణిపేట: గాజువాకలో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ స్థలం గానీ, వ్యాపార సముదాయ భవనం గానీ కేటాయించాలని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి, వినతిపత్రం అందజేశారు. విస్తరిస్తున్న విశాఖలో మరో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, ఏపీహెచ్‌డీసీ డైరెక్టర్ పైడి రమణ, విశాఖ లేపాక్షి మేనేజర్ విజయగౌరి, సిబ్బంది దయానంద తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌ను సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

నవ వధువుకు తాళిబొట్టు అందజేత



తాళిబొట్టు, పట్టుచీర అందిస్తున్న నాగరాజు

అల్లిపురం: కేఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు 29వ వార్డుకు చెందిన కనకరెడ్డి, వరలక్ష్మీ దంపతుల కుమార్తె కొల్లి వసుంధరకు వివాహ నిశ్చయమైన సందర్భంగా ఆమెకు మంగళవారం బంగారు తాళిబొట్టు, పసుపు కుంకుమ, పట్టుచీర అందజేశారు. ఈ సందర్భంగా 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు మాట్లాడుతూ కందుల నాగరాజు చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కందుల కేధార్‌నాథ్, కందుల బద్రీనాథ్ పాల్గొన్నారు.

పోలీసుల ఔదార్యం



రక్తదానం చేస్తున్న పోలీసులు

ఆరిలోవ: అత్యవసర పరిస్థితిలో ఓ యువతికి రక్తం అందించి నగర పోలీసులు తమ ఔదార్యం చాటుకున్నారు. అనకాపల్లి జిల్లా మెల్లిపాక గ్రామానికి చెందిన సీహెచ్.సాయి అనే 19 ఏళ్ల యువతి అప్లాస్టిక్ అనీమియా అనే సమస్యతో బాధపడుతోంది. ఆమె తల్లిదండ్రులు వైద్యం కోసం ఆరిలోవ హెల్త్ సిటీలో పినాకిల్ ఆస్పత్రిలో చేర్చారు. ఆమె చికిత్సకు రక్తం అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న నగర పోలీసులు రక్తదానానికి ముందుకొచ్చారు. సైబర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు జి.సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, కె.దివ్యవాణితో పాటు విశ్రాంత హెచ్‌సీ జె.శ్రీనివాసరావు రక్తదానం చేసి ఆ యువతికి అందించారు.

33వ వార్డులో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాల మానిటర్‌ను పరిశీలిస్తున్న సీఐ తిరుమలరావు తదితరులు

అల్లిపురం: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని టూటౌన్ సీఐ తిరుమలరావు అన్నారు. జీవీఎంసీ 33వ వార్డులోని కీలక జంక్షన్లలో సుమారు రూ.5లక్షల జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మితో కలసి మంగళవారం ఆయన ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ జీవీఎంసీ నిధులను సీసీ కెమెరాల ఏర్పాటుకు కేటాయించడం హర్షణీయమన్నారు. నేరాల నియంత్రణలో స్థానికులు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. వార్డు పరిధిలోని అమ్మవారి వీధి అంగన్‌వాడీ జంక్షన్, బంగారుమెట్ట శ్రీ రామాంధ్ర యువజన సమాజం, కుమ్మరవీధి సచివాలయం, గౌరీవీధి సచివాలయం, బంగారమ్మమెట్ట సచివాలయం, బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి గుడి, కొల్లు వారివీధి ప్రజా మరుగుదొడ్లు, వెంకటేశ్వరమెట్ట 1,2 సచివాలయ ప్రాంతాల్లో ఈ కెమెరాలను ఏర్పాటు చేశారు. బంగారుమెట్ట శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం అధ్యక్షుడు భీశెట్టి హనుమంతరావు, అల్లిపురం సంఘం సభ్యుడు శ్రీను, భీశెట్టి గోపీకృష్ణ, జీవీఎంసీ ఎలక్ట్రికల్ ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్, స్థానికులు పాల్గొన్నారు.

చైతన్యంతో ఆడపిల్లలపై వివక్షకు చెక్



మాట్లాడుతున్న మోడల్ స్కూల్ హెచ్‌ఎం కనకమహాలక్ష్మి తదితరులు

అల్లిపురం: ప్రజల్లో చైతన్యంతోనే ఆడపిల్లలపై వివక్ష తొలగింపు సాధ్యమని మోడల్ స్కూల్ హెచ్‌ఎం కనకమహాలక్ష్మీ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం అల్లిపురం జీవీఎంసీ మోడల్ స్కూల్‌లో గౌరీవీధి సచివాలయం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లల సంరక్షణ బాధ్యత అందరూ తీసుకోవాలన్నారు. ఎడ్యుకేషనల్ సెక్రటరీలు బంధం రమేష్ బాబు యాదవ్, బి.రేణుక, పీవీ కిరణ్‌కుమార్, సచివాలయ కార్యదర్శులు ప్రమీలాదేవి, ప్రత్యూష, డానియల్, ఉపాధ్యాయులు జయలక్ష్మి పాల్గొన్నారు.

ఏవీఎన్ కళాశాలలో జాబ్‌మేళా

అల్లిపురం: ఏవీఎన్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ది ప్లేస్‌మెంట్ పార్క్ పేరిట నిర్వహించిన ఈ మేళాకు సుమారు 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ప్లేస్‌మెంట్ అధికారి డి.సంతోష్‌కుమార్ సమన్వయంతో వ్యవహరించారు.

ఐక్యూ ఏపీ కో–ఆర్డినేటర్ పి.కృష్ణకుమారి, హెచ్‌ఆర్ మేనేజర్ కేవీఎస్ సురేంద్రవర్మ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

కోడి పందాల శిబిరంపై దాడి

ఆరిలోవ: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి శాంతినగర్‌లో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై ఆరిలోవ పోలీసులు మంగళవారం దాడి చేశారు. మందస్తు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సుమారు పది పందెం కోళ్లు, ఐదు ద్విచక్ర వాహనాలతో పాటు నిర్వాహకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన



వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మంగళవారం దొండపర్తి, ఫిషింగ్ హార్బర్, బొడ్డునాయుడు తోట, డ్వాక్రా బజార్, ఎల్లమ్మతోట, లక్ష్మీటాకీస్ బస్‌స్టాప్ ప్రాంతాలలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఏడుగురు బాధితులకు ఎమ్మెల్యే మొత్తం రూ.23వేలు ఆర్థిక సహకారం అందజేశారు. ఎల్లమ్మతోటకు చెందిన జలగడుగుల మహేశ్వరికి రూ.5వేలు, అశోక్‌నగర్‌కు చెందిన జలగంపల పద్మకు రూ.5వేలు, చిలకపేటకు చెందిన పప్పు జయలక్ష్మీకి రూ.5వేలు, సూరాడ బంగారయ్యకు రూ.5వేలు, పింఛన్ అందని ముగ్గురు వికలాంగులకు రూ.1000 చొప్పున సహాయం చేశారు. ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమాల్లో కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, సీనియర్ నాయకులు భానుమూర్తి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాణిపేట ఇన్‌చార్జి తహసీల్దారుగా అర్జునరావు

మహారాణిపేట: మహారాణిపేట ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వి.అర్జునరావుకు బాధ్యతలు అప్పగించారు. తహసీల్దార్ కె.రమామణికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించిన సంగతి తెలిసిందే. సుజల స్రవంతి ప్రాజెక్టు(అనకాపల్లి)కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులవడంతో ఆమెను రిలీవ్ చేస్తూ కలెక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు.

దీంతో ఆమె మంగళవారం రిలీవ్ అయ్యారు. అదే కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వి.అర్జునరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

హోటళ్లు, పర్యాటక ప్రాంతాల పరిశీలన



సమావేశ ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీపీ శ్రీకాంత్

ఏయూ క్యాంపస్: నగరంలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న జీ–20 సదస్సుకు పెద్ద సంఖ్యలో విదేశీ ప్రతినిధులు హాజరై, వివిధ ప్రాంతాలలో బస చేయనున్నారు. సమావేశ నిర్వహణ, భద్రత దృష్ట్యా నగర సీపీ సీహెచ్.శ్రీకాంత్ నగరంలోని పలు హోటళ్లు, పర్యాటక ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. ఏడీజీపీ డాక్టర్ ఎ.రవిశంకర్ అయ్యనార్, విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ, ఎస్పీ(అల్లూరి జిల్లా) ఎస్. సతీష్‌కుమార్ తదితరులతో కలసి నగరంలో హోటళ్లు, పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు.

అందరికీ విద్య అందించడమే లక్ష్యం



విద్యార్థులకు యూనిఫాం అందస్తున్న ఎస్ఎస్ఏ ఏపీసీ శ్రీనివాసరావు

అల్లిపురం: బడిఈడు పిల్లలందరికీ విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ శ్రీనివాసరావు అన్నారు. డ్రాపవుట్ సర్వేలో భాగంగా గుర్తించిన ఇద్దరు పిల్లలను మంగళవారం నగరంలోని ప్రకాశరావుపేట పాఠశాలలో చేర్పించారు. జగనన్న విద్యా కానుకలో భాగంగా వారికి పుస్తకాలు, యూనిఫారాలు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం మేరకు 14 ఏళ్లలోపు పిల్లలు తప్పనిసరిగా బడిలోనే ఉండాలన్నారు. డ్రాపవుట్ సర్వే నిరంతరం సాగుతుందన్నారు. జాతీయ బాలికల దినోత్సవం రోజున ఒకే ఇంట్లో ఉన్న అక్కాతమ్ముడిని బడిలో చేర్పించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా కో ఆర్డినేటర్ వానపల్లి శైలజ, తదితరులు పాల్గొన్నారు.